న్యూఇయర్‌కు స్వాగతం



- కిటకిటలాడిన బేకరీలు, హోటళ్లు
- వివిధ డిజైన్లలో కేకులు
- ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన నిర్వాహకులు
- పాతసంవత్సరానికి వీడ్కోలు



ఖానాపూర్: పాత సంవత్సరం 2022కు వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు అన్ని వర్గాల ప్రజలు. న్యూయర్ కేకులు వివిధ డిజైన్లలో దర్శనమివ్వగా కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపారు. ఈసందర్భంగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్‌హౌస్‌లు సందడిగా మారాయి. దీంతో బేకరీల, హోటళ్ల నిర్వాహకులు ప్రత్యేకంగా ఆఫర్లు పెట్టి వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కేకుల ధర రూ.వంద నుంచి రూ.500 వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని రెస్టారెంట్లలో వెజ్, నాన్‌వెజ్ ప్యాక్‌లను న్యూఇయర్ ధమాకా ఆఫర్లతో యూత్‌ను ఆకట్టుకునేలా సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు. డోర్ డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.





క్లుప్తంగా

రూ.5.25 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

భైంసాటౌన్: పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ సబియాబేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా వార్డుల్లో రూ.5.25 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌కుమార్, వైస్‌చైర్మన్ జాబీర్ అహ్మద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

లింగవ్వ కుటుంబానికి పరామర్శ



జోహార్లు తెలుపుతున్న నాయకులు

కడెం: సమాజంలో ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం విప్లవ ఉద్యమాలు కొనసాగుతాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామంలో మావోయిస్ట్ కంతి లింగవ్వ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా లింగవ్వ చిత్రపటానికి నివాళులర్పించి జోహార్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి రాజు, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు సునారికారి రాజేశ్, లింగన్న పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, పాస్టర్

కడెం: మండల కేంద్రంలోని పంచాయతీలో శనివారం 10 మంది పంచా యతీ సిబ్బందికి కల్వరి ఆశీర్వాద ప్రార్థన మందిరం పాస్టర్ పాల్ కరుణాకర్, సర్పంచ్ అనూష రూ.ఐదు వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. వకీల్ నగర్‌కు చెందిన 30 మంది పేదలకు బెల్లాల్ క్యాథలిక్ చర్చి ఫాదర్ జోషి రూ.ఆరు వేల విలువైన దుప్పట్లు పంపిణీ చేశారు.

పీఎస్‌బీ ఎరువులతో భూమి సారవంతం



సోన్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఈవో

లక్ష్మణచాంద: పీఎస్‌బీ ఎరువుల వినియోగంతో భూమిలో సారవంతం పెరుగుతుందని సోన్ ఏఈవో అంబాజీ సూచించారు. శనివారం సోన్ మండల కేంద్రంలో వరి పొలం వద్ద నారుమడి యాజమాన్య పద్ధతులు, నాటు వేసే విధానం రైతులకు వివరించారు. పీఎస్‌బీ జీవన ఎరువులు భూమిలో భాస్వరం కరిగించి మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందేలా చూస్తుందన్నారు. దీంతో పెట్టుబడులు తగ్గి.. దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు.

శ్మశానవాటిక స్థలం కాపాడాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రం సమీపంలోని చించోలి(బి) గ్రామంలో ఓ వర్గంవారు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని అధికారులు కాపాడాలని శనివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా బీజేపీ యువ మోర్చా నాయకులు కుమ్మరి వెంకటేష్ మాట్లాడారు. చించోలి-బి గ్రామంలో సర్వేనంబర్లు 408, 426, 427లో హిందూ శ్మశానవాటికకు చెందిన కొంత స్థలాన్ని చదును చేశారని.. నంది విగ్రహం కూడా తొలగించారన్నారు. ఇప్పటికే గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌కు సమాచారం అందించామన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేవైఎం కార్యకర్తలు ఉన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

భైంసాటౌన్: విద్యార్థులు ఆయా కోర్సుల్లో నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహిస్తున్న ఆరోగ్య ప్రదర్శన శనివారం కొనసాగింది. దీనికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. భైంసా డిగ్రీ కళాశాల అధ్యాపకులు మధు, డైరెక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్ పాల్గొన్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటు అభినందనీయం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి

మామడ: మండలంలోని పరిమండల్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు అభినందనీయమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి అంగన్‌వాడీ కేంద్రం సందర్శించగా విద్యార్థులు స్వాగతం పలికారు. కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గార్డెన్‌కు ప్రహరీ నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్ కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పరిమండల్ గ్రామంలో శివన్న అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. కమల్‌కోట్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త భూషణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి పరామర్శించి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట లింగారెడ్డి, గంగారెడ్డి, భాస్కర్ రావ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. లక్ష్మణచాందకు చెందిన తక్కవ్వకు రూ.31వేలు, మండలంలోని మల్లాపూర్ పంచాయతీ పరిధిలోని మాచాపూర్‌కు చెందిన గంగయ్యకు రూ.55వేల చెక్కులను అందజేశారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భిక్ష

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు వడ్డించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, గురుస్వాములు శ్రీనివాస్, బద్రి శీను, అడప నవీన్, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత కరువు

- దెబ్బతింటున్న సదర్మాట్ ప్రధాన కాలువ



మళ్లీ కుంగిన కాలువ ప్రాంతం

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో వర్షాకాలంలో సదర్‌మాట్ ప్రధాన కాల్వ దెబ్బతినడంతో ఇటీవల అధికారులు రూ.15లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తాజాగా శుక్రవారం నీటిని విడుదల చేయడంతో మళ్లీ కాల్వ కుంగిపోయింది. సమీపంలో కాలువకు బుంగ పడడంతో నీరంతా వృథాగా పోతుంది. దీంతో యాసంగిలో కడెం ఆయకట్టుకు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల జేఈ ఉదయ్‌ను వివరణ కోరగా రైతులెవరూ ఆందోళన చెందవద్దని.. నీటి ఉధృతిని తగ్గించి మళ్లీ కాల్వకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

దెబ్బతిన్న కాలువ ప్రాంతాన్ని శనివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు రమేశ్, తోట సత్యం, గోసంపల్లె గ్రామాధ్యక్షులు రాజ్‌కుమార్, రైతులు తదితరులు పరిశీలించారు. ఈ విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.

‘వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులు’



ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిపక్షాల నాయకులను అరెస్ట్ చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ నోటిఫికేషన్‌లో తప్పులను సవరించాలనే డిమాండ్‌తో శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చిందన్నారు. కాని నిరసన తెలిపే అవకాశం లేకుండా నాయకులను అరెస్ట్ చేయించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఖానాపూర్‌లో అరెస్టయిన వారిలో నాయకులు నిమ్మల రమేష్, తోట సత్యం, మడిగెల అనిల్, నదీంగౌడ్, వంశీ, శంకర్‌గౌడ్, జహీర్ తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల : తెలంగాణ పోలీసు నోటిఫికేషన్‌లో అవకతవకలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టిన విషయం తెలిసిందే. కాగా శనివారం కుంటాలలో ఏఎస్సై రాందాస్, ఆధ్వర్యంలో నాయకులు ప్రశాంత్, యూనిస్, అవేష్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు.



గుంతలు పూడ్చివేయరూ



జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కంపెనీ ఫైబర్‌గ్రిడ్ లైన్ ఏర్పాటు కోసం ప్రధాన రోడ్డు పక్కన గుంతలు తవ్వుతూ వాటిని పూడ్చకుండానే వదిలేస్తున్నారు. దీంతో రాత్రివేళ రాకపోకలు సాగించే వాహనదారులు గుంతల వద్ద అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్రైం కార్నర్..

15 మందిపై కేసు

లోకేశ్వరం: మండలంలోని మొహళ గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా పరారీలో ఉన్న 15 మంది పేకాటరాయుళ్లపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. పేకాట, జూదం ఆడితే ఎంతటివారినైనా వదలబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



దేవన్న (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన గుండోల్ల దేవన్న(58) అనే వృద్ధుడు శనివారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. దేవన్న గత నెల 26న వ్యవసాయ పనులు ముగించుకుని ఎడ్లబండిపై ఇంటికి వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడిపై నుంచి ఎడ్లబండి వెళ్లగా కుటుంబసభ్యులు దేవన్నను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మరణించాడు. మృతుడికి భార్య శేష, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం సేవించి నడిపితే చర్యలు

లక్ష్మణచాంద: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై రాహుల్ గైక్వాడ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు తనిఖీ చేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా ఇళ్లలోనే జరుపుకోవాలని.. రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బంది కల్గించవద్దని సూచించారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన మర్రి వివేక్ ఆత్మహత్య చేసుకోవడంతో శనివారం బాధిత కుటుంబాన్ని టీజీఏ జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ పరామర్శించారు. అంకం రాజేందర్, పరిమి సురేష్, కొక్కుల ప్రదీప్, తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్

- ఖానాపూర్ సీఐ అజయ్‌బాబు
- 28బైక్‌లు, నాలుగు ఆటోలు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ అజయ్‌బాబు

పెంబి: శాంతిభద్రతల పరిరక్షణకే గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని.. ప్రజలు సహకరించాలని ఖానాపూర్ సీఐ అజయ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో శనివారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 28 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడారు. యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరం ఉండాలన్నారు. గ్రామాల్లోకి అపరిచితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ధ్రువపత్రాలు తీసుకొచ్చి వాహనాలు తీసుకెళ్లాలని.. ధ్రువపత్రాల్లేని వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. పెంబి ఎస్సై రజినీకాంత్, కడెం ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

పఠనాసక్తి పెంచేందుకే ‘పుస్తక వినోదం’




జాఫ్రాపూర్‌లో పుస్తక పఠనంలో విద్యార్థులు

లక్ష్మణచాంద: విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంచేందుకే పుస్తక వినోదం కార్యక్రమం నిర్వహించినట్లు జాఫ్రాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.పరమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం సోన్ మండలంలోని జాఫ్రాపూర్ పాఠశాలలో పుస్తక వినోదం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు పుస్తకాలు, మ్యాగజైన్లు, దిన, వార, పక్ష పత్రికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు తాము చదివిన పుస్తకాల్లోని పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నరేందర్‌రెడ్డి, ముత్తన్న, నాగేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ పుస్తకాలు చదివితే వచ్చే జ్ఞానం విద్యార్థులకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్నయాదవ్, చైర్మన్ భీంరావుదేశాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో న్యూఇయర్ వేడుకలు



కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో..

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, లక్ష్మణచాందలోని సహకార జూనియర్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ప్రిన్సిపాల్ మహిపాల్, అధ్యాపకులు కిష్టయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, భోజన్న, రమేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రంలోని శాంతినికేతన్, ఆదర్శ, కల్లూర్ కేజీబీవీలో విద్యార్థులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మండలంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్సై రాందాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్‌ప్రసాద్, సంతోష్, సవితారాణి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు.విద్యార్థులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ముమ్మరంగా రోడ్డు పనులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా శనివారం రోడ్డు పనులు చేపట్టారు. వెంటనే పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సతీష్‌రావు, లింగేశ్వర్, నేత శ్యాం, రాజేశ్వర్, రవికాంత్, భీమేశ్వర్, జనార్దన్, మల్లయ్య, రవి, వినోద్, శంకర్ ఉన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఫెస్టివల్ వద్ద గ్రామస్తుల సందడి

తానూరు: మండలంలోని కల్యాణి ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయగా శనివారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు రకాల వంట కాలను తయారు చేసి ప్రదర్శనకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీకాంత్ సిండే, గంగుల చిన్నన్న, ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, అజర్, గ్రామస్తులు, విద్యార్థుల పోషకులు పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ఒకటో వార్డు పరిధి శాంతినగర్ కాలనీలో శనివారం భగీరథ పైపులైన్ల లీకేజీలకు కౌన్సిలర్ కావలి సంతోష్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. లీకేజీలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కౌన్సిలర్ పేర్కొన్నారు.

5 నుంచి క్రికెట్ పోటీలు

కుంటాల : సంక్రాతి పండుగ పురస్కరించుకొని మండలంలోని దౌనెల్లి గ్రామంలో జనవరి ఐదో తేదీ నుంచి లెవెన్‌స్టార్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. విజేతకు రూ.21,011, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11,011, ఆల్‌రౌండర్లకు ట్రోఫీలను అందజేస్తామన్నారు. ప్రవేశరుసుం రూ.900గా నిర్ణయించామని.. ఆసక్తి కల్గిన వారు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9618465680 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కుంటాల : మండల కేంద్రంలో శనివారం పెంచికల్‌పాడ్‌కు చెందిన కుమ్మరి సంతోష్‌కు రూ.36వేలు, కుంటాలకు చెందిన ప్రశాంత్‌కు రూ.16వేలు, కల్లూర్‌కు చెందిన శ్రీనివాస్‌కు రూ.16వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తు, సింగిల్‌విండో చైర్మన్ గజ్జారాం, మహేందర్, రవి, లక్ష్మణ్‌పటేల్, మల్లేష్‌గౌడ్, రజనీకాంత్ పాల్గొన్నారు.